క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో కుమార షష్ఠి



పంచారామ క్షేత్రంలోని కుమారస్వామి

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామ భీమేశ్వరస్వామి ఆలయంలోని కుమార స్వామి ఆలయంలో మంగళవారం కుమార షష్ఠి వేడుకలు నిర్వహించారు. ఈఓ బళ్ల నీల కంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, సన్నిధిరాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్ ఆధ్వర్యంలో కుమార స్వామికి పంచామృతాలతో అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక అలంకరణ జరిగింది. కుమార షష్ఠిని పురస్కరించుకుని భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కాగా మూడో తేదీ గురువారం అష్టమి సందర్భంగా ఆలయంలో వేంచేసి యున్న మహిషాసుర మర్ధిని అమ్మవారి ఆలయంలో దుర్గాష్టమిగా అమ్మవారికి అభిషేకాలు, పూజలు జరుగుతాయని ఈఓ చెప్పారు. భక్తులు అమ్మ వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

పెద్దాపురం: స్థానిక ఎన్టీఆర్ కాలనీలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు బెతస్థ హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు జీవీ రత్నం తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఇండియన్ క్రిస్టియన్ డే సందర్భంగా ఉదయం పల్స్ ఎమర్జెన్సీ హాస్పటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు తెలిపారు. 9 గంటల నుంచి ఒంటిగంట వరకు ప్రముఖ వైద్యులు అంజనేయులు, జాహ్నవి, వైవీ ప్రతాప్, ప్రత్యూషలచే అన్ని రకాల జబ్బులకు ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు ఇస్తారన్నారు. ఎన్టీఆర్ కాలనీ అపార్ట్మెంట్స్‌లో నిర్వహించే వైద్య సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రత్నం కోరారు.

గొల్లప్రోలు తహసీల్దార్‌గా గోపాలకృష్ణ



బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ గోపాలకృష్ణ

పిఠాపురం: గొల్లప్రోలు తహసీల్దార్‌గా పిఠాపురం తహసీల్దార్ పి.గోపాలకృష్ణ మంగళవారం పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన తహసీల్దార్ సత్యనారాయణ పదవీ విరమణ చేయడంతో ఆయనకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

10న మెగా పేరెంట్స్ సమావేశం

సామర్లకోట: ఈనెల పదో తేదీన నిర్వహించనున్న మెగా పేరెంట్స్ సమావేశాన్ని విజయవంతం చేయాలని బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. సోమవారం సాయంత్రం ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి తరగతికి సంబంధించిన విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి ప్రతి ఒక్కరూ సమావేశానికి హాజరయ్యేలా చూడాలన్నారు. తల్లిదండ్రుల ద్వారా వారి పిల్లల సమాచారం సేకరించాలని, తల్లిదండ్రు లు ఇచ్చే సూచనలు, సలహాలు పాటించడం ద్వారా విద్యార్థులను మరింత ఉత్తమంగా తయారు చేయడానికి అవకాశం ఉంటుందన్నారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాల తనిఖీ



విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న ఎంఈఓ-2 పుల్లయ్య

సామర్లకోట: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మండల విద్యాశాఖాధికారి-2 పి. పుల్లయ్య మంగళవారం తనిఖీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల సాధారణ తనిఖీల్లో భాగంగా ప్రభుత్వ హైస్కూల్‌లో విద్యార్థులకు అందుతున్న సదుపాయాలు, తల్లికి వందనం, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం తీరును పరిశీలించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందజేయాలన్నారు. విద్యార్థులు అందరూ భోజనం చేసేలా నాణ్యతతో వండి వడ్డించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం ప్రసూన తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం ఇచ్చాం.. దయ చూపండి..

- సొమ్ముల కోసం అన్నదాత వేడుకోలు
- నెలలు కావస్తున్నా జమ కాని వైనం
- రేపుమాపు అంటున్న అధికారులు
- ఖరీఫ్ పెట్టుబడులకు అవరోధం



ధాన్యాన్ని విక్రయిస్తున్న రైతు (ఫైల్)

కొత్తపల్లి: ప్రభుత్వం రైతుల వద్ద నుంచి రబీ ధాన్యాన్ని కొనుగోలు చేసి సుమారు రెండు నెలలు గడుస్తున్నా తమ ఖాతాల్లోకి నగదు జమ కాలేదని రైతులు వాపోతున్నారు. ఖరీఫ్ సీజన్ ఇప్పటికే ప్రారంభం కావడంతో ఎరువుల దుకాణాలలో బాకీలు, ఇంటి ఖర్చులు, కూలీల ఖర్చులు చెల్లించాల్సి ఉండడంతో తమ ధాన్యం సొమ్ములు ఎప్పుడొస్తాయోనని రైతులు ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం మాత్రం ఈ వారం, వచ్చే వారం అంటూ బిల్లుల చెల్లింపుల్లో జాప్యం చేస్తోంది. మండల పరిధిలో 10,254 ఎకరాలలో సాగు చేస్తుండగా సుమారు 6,043 మంది రైతులు ఉన్నారు. వారి నుంచి మే నెల నాటికి 9,658 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. వీటికి మండలంలో 206 మంది రైతులకు సుమారు రూ.2.85 కోట్లు రావాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకూ నగదు జమ కాలేదు. వర్షాకాలం వస్తోందని, పంట వేసుకునేందుకు సన్నద్ధం కావాలంటే తెచ్చిన అప్పులు తీర్చాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. నెలలు గడుస్తున్నా అధికారులు మాత్రం స్పందించకపోవడంపై రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కంటే ఈ సంవత్సరం బస్తాకు రూ.100 నుంచి రూ.300 వరకూ తక్కువ ధరకు విక్రయించే పరిస్థితి ఏర్పడిందని రైతులు చెబుతున్నారు. రెండు నెలలు గడుస్తున్నా విక్రయించిన ధాన్యానికి సొమ్ము జమ కాకపోవడంతో అప్పులకు వడ్డీలు కట్టలేక ఏం చేయాలో తెలియని పరిస్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు.

ధాన్యం సొమ్ము రాలేదు



నేను 250 క్వింటాళ్ల ధాన్యం విక్రయించా. దానికి సంబంధించి సొమ్ములు ఇప్పటి వరకూ రాలేదు. ఎరువులు, పురుగు మందుల దుకాణాల వద్ద బకాయి చెల్లించాల్సి ఉంది. ఆ సొమ్ము ఎప్పుడు వస్తుందో అర్థం కావడంలేదు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సొమ్ము ఖాతాలకు జమ చేయాలి.

– కె.లోవకుమార్‌రెడ్డి, రైతు, ఇసుకపల్లి

ఖరీఫ్ సీజన్ వచ్చింది



రబీ సీజన్‌లో పండించిన ధాన్యం సొమ్ము ఇప్పటి వరకూ జమకాలేదు. ఖరీఫ్ సీజన్ కూడా వచ్చేసింది. నేను 200 క్వింటాళ్ల ధాన్యాన్ని విక్రయించాను. సుమారు రెండు నెలలు గడుస్తున్నా ధాన్యం సొమ్ము జమకాలేదు. అధికారులు మాత్రం ఖాతాల్లోకి జమ అవుతుందని చెప్తూవస్తున్నారు. సొమ్ము జమకాకపోవడంతో ఖరీఫ్ సాగుకు పెట్టుబడి ఏ విధంగా సమకూరుతుందో అర్థం కావడం లేదు.

– వి.సూర్యప్రకాశరావు, రైతు, కొండెవరం

అధినేతతో ఆత్మీయ కలయిక



తాడేపల్లిలో వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని కలసిన వీరంరెడ్డి నాని

సామర్లకోట: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు వీరంరెడ్డి నాని కలిసారు. మంగళవారం తాడేపల్లిలో జరిగిన యువజన విభాగం సభ్యులతో జరిగిన సమావేశం సందర్భంగా ఆయనను మర్యాదపూర్వకంగా కలసినట్టు నాని తెలిపారు. సామర్లకోట మండలం అచ్చంపేటకు చెందిన నానిని ఇటీవల నియోజకవర్గం యూత్ అధ్యక్షునిగా నియమించిన విషయం తెలిసిందే

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా డాక్టర్ శ్రీనివాసరావు



లయన్స్ క్లబ్ నూతన కమిటీ సభ్యులను అభినందించిన జిల్లా గవర్నర్, జిల్లా అధ్యక్షుడు



వైద్యులను సత్కరించిన లయన్స్ క్లబ్ ప్రతినిధులు

సామర్లకోట: స్థానిక లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా డాక్టర్ అమలకంటి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికై నట్టు క్లబ్ జిల్లా అధ్యక్షుడు చిత్తులూరి వీర్రాజు తెలిపారు. మంగళవారం స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో ఆయన మాట్లాడుతూ ఏటా జూలై ఒకటి నుంచి లయన్స్ క్లబ్ ఏడాది ప్రారంభం అవుతుందని, ఈ మేరకు నూతన అధ్యక్షుడిగా శ్రీనివాసరావు, కార్యదర్శిగా బడుగు సీతారామరాజు (బాబి), కోశాధికారిగా యేలేటి రమేష్ ఎంపిక అయ్యారన్నారు. స్థానిక క్లబ్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేయడంతో పాటు సభ్యుల సంఖ్యను పెంచడం వల్ల క్లబ్‌లోని సీనియర్ సభ్యుడికి జిల్లా గవర్నర్ పదవి లభించిందన్నారు. జిల్లా గవర్నర్ ఈదల ఈశ్వరకమార్ మాట్లాడుతూ నూతన కమిటీ ఏర్పాటైన తరువాత ఏటా ఆరో తేదీన జునోసిస్ డేను పురస్కరించుకుని స్థానిక మండల పశువైద్య కేంద్రంలో కుక్కలను ఉచితంగా వ్యాక్సిన్ వేయించనున్నట్టు తెలిపారు. అనంతరం స్థానిక సీహెచ్‌సీలో క్లబ్ ప్రతినిధి ఎస్‌వీవీ సూర్యనారాయణమూర్తి రోగుల కోసం నిర్మించిన విశ్రాంతి షెడ్‌ను ప్రారంభిస్తారన్నారు. సామర్లకోట–శ్రీభీమేశ్వర లయన్స్ క్లబ్ ఏర్పడి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సిల్వర్ జుబ్లీ వేడుకలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు కర్రి ఆదినారాయణ రెడ్డి, గుండు శంకరరావు, కానుబోయిన విజయకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

> లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ ఈశ్వరకుమార్

వైద్యులు ప్రాణదాతలు

వైద్యుల దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ ఈదల ఈశ్వరకుమార్ వైద్యులు చాగంటి సన్యాసిరాజు, శ్రీవల్లీదేవి మహోన్నత్‌లను మంగళవారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు చిత్తులూరి వీర్రాజు, క్లబ్ అధ్యక్షుడు డాక్టరు అమలకంటి శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

'వర్గీకరణ'తోనే సామాజిక న్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న కామరాజు

పెద్దాపురం: ఓబీసీ ఉప కులాలు, ఎస్టీ ఉపకులాలకు వర్గీకరణతోనే సామాజిక న్యాయం సాధ్యమని జాతీయ సామాజిక న్యాయ పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వడ్డి కామరాజు అన్నారు. స్థానిక కొండయ్యపేట కమ్యూనిటీ హాలులో మంగళవారం పెద్దాపురం మండల అధ్యక్షుడు వేమగిరి ప్రసన్న కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కామరాజు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు అమలు చేస్తున్న రిజర్వేషన్లు బీసీలకు సైతం వర్తింపజేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యం వల్ల బీసీ, ఎస్టీలకు అమలు కావాల్సిన రిజర్వేషన్లు పూర్తి స్థాయిలో అమలు కావడం లేదన్నారు. దళిత క్రైస్తవులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు విద్య, ఉద్యోగాల్లో ఎస్సీ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీని కోసం పోరాటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో మందపల్లి రుద్రయ్య, ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆక్వారిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



సమావేశంలో మాట్లాడుతున్న నూతన అధ్యక్షుడు వీరబాబు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): స్థానిక హోటల్‌లో మంగళవారం ఆక్వారిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా కాకినాడకు చెందిన చొల్లంగి వీరబాబు, గౌరవ అధ్యక్షుడిగా విశాఖపట్నానికి చెందిన నాగవర్మ, ఉపాధ్యక్షుడిగా గుంటూరుకు చెందిన కొవ్వూరి విమలబాబు, కార్యదర్శిగా రాజమహేంద్రవరానికి చెందిన బొల్ల బంగార్రాజు, సంయుక్త కార్యదర్శిగా విశాఖపట్నానికి చెందిన తాతపూడి రంగారావు, ట్రెజరర్‌గా నెల్లూరుకు చెందిన మీర్ జమీర్ హుస్సేన్ ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడు వీరబాబు మాట్లాడుతూ సభ్యుల సంక్షేమం కోసం నూతన కార్యవర్గం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఫిషరీస్ డెవలప్‌మెంట్ అధికారి గోపి, అసోసియేషన్ కోర్ కమిటీ సభ్యులు రవి, సోమశేఖర్ పాల్గొన్నారు.

కంటితుడుపు చర్యగా రిజర్వేషన్లు

ఆర్ఎస్ రత్నాకర్

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): 1935 నాటి రాజ్యాంగం ప్రకారం బ్రిటిష్ ప్రభుత్వమే ఎస్సీ, ఎస్టీ గ్రూపులను విభజించకూడదని చెప్పి రిజర్వేషన్ కల్పించిందని నేషనల్ ప్రెసిడెంట్ ఫర్ రాక్స్ అండ్ సర్వజన సమాజ్ ఆర్ఎస్ రత్నాకర్ పేర్కొన్నారు. మంగళవారం కాకినాడలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రిజర్వేషన్ అనేది ఆనాటి పరిస్థితుల్లో ఒక కంటి తుడుపు చర్యగా ఆయన అభివర్ణించారు. వాటాల కోసం ఈ కులాలు కొట్టుకోకూడదు, విభజించకూడదన్న ఉద్దేశంతోనే ఈ గ్రూపులను క్రియేట్ చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీలను విభజించకూడదనే అవగాహన విదేశీ పాలకులకే ఉన్నప్పుడు, స్వదేశీ పాలకులైన మోదీ, చంద్రబాబు, రేవంత్ రెడ్డిలకు తెలియ లేదా ప్రశ్నించారు. చంద్రబాబు, మోదీకి దమ్ముంటే సుప్రీంకోర్టు జడ్జిల విషయంలో, భూముల విషయంలో, పరిశ్రమల విషయంలో, దేశ సంపద విషయంలో, మీ క్యాబినెట్ పదవుల విషయంలో వర్గీకరణ చేపట్టి నిజాయితీని నిరూపించుకోవాలని రత్నాకర్ సవాల్ విసిరారు. వర్గీకరణను వెనక్కు తీసుకునేంత వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు కొప్పుల ప్రేమ్ బాబు, చిన్నవెంకటేశ్వరరావు, నెల్లి సూరిబాబు, దారా నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

దేశ నిర్మాణంలో సీఏల పాత్ర కీలకం



సీఏ జెండాను ఆవిష్కరిస్తున్న కాకినాడ బ్రాంచ్ చైర్మన్ శ్రీనివాసరావు

బోట్‌క్లబ్: దేశ నిర్మాణంలో చార్టర్డ్ అకౌంటెంట్లు (సీఏ) కీలక భూమిక పోషిస్తున్నారని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ కాకినాడ బ్రాంచ్ చైర్మన్ తాళ్లూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని శాఖలో మంగళవారం సీఏ డేని ఘనంగా నిర్వహించారు. సీఏ జెండాను చైర్మన్ ఎగురవేశారు. నేడు సీఏ వృత్తిలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించి ముందుకు వెళ్లాలన్నారు. రోటరీ బ్లడ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పలువురు సీఏలు రక్తదానం చేశారు. కాకినాడ బ్రాంచ్ చైర్మన్ తాళ్లూరి శ్రీనివాసరావు 107వ సారి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు ఆయనను అభినందించారు. అనంతరం ప్రముఖ వైద్యుడు వాడ్రేవు రవి ఆధ్వర్యంలో ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ చార్టెడ్ అకౌంటెంట్ ఆదిత్య శర్మ, సీఏ అసోసియేషన్ సెక్రటరీ పాండురంగమూర్తి, ట్రెజరర్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఏయూ రీజియన్ టెక్నికల్ ఆర్జేడీగా రామచంద్రరావు

కాకినాడ సిటీ: సాధారణ బదిలీల్లో భాగంగా ఆంధ్ర యూనివర్శిటీ రీజియన్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఆర్జేడీగా నియమితులైన జీవీ రామచంద్రరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన కాకినాడ కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

సమస్యల పరిష్కారం కోరుతూ ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వివిధ కాలనీల ప్రజలు

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్ మండలం తూరంగి అనిశెట్టి బుల్లెబ్బాయిరెడ్డి కాలనీ, కాకినాడ సిటీ శాంతి నగర్, పర్లోపేటలో నివాసం ఉంటున్న కాలనీవాసులు భారత విప్లవ కమ్యూనిస్టు పార్టీ ఆర్‌సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి రంబాల సతీష్ మాట్లాడుతూ బుల్లెబ్బాయిరెడ్డికాలనీలో 20 ఏళ్లుగా డ్రైనేజీలు, రోడ్లు లేక కాలనీ వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వర్షాకాలంలో విష జ్వరాలు వస్తున్నాయని, ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. పట్టణంలో శాంతినగర్, పర్లోవపేటల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టడం లేదని డ్రైన్లలో మురుగునీరు పారడం లేదన్నారు. వ్యర్థాలు తొలగించడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే పారిశుద్ధ్య పనులు మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కార్యదర్శి శివకోటి రాజు, వడ్లమూరి మంగ, పార్టీ సభ్యులు వరలక్ష్మి, జీవన్, ఆర్ పద్మకుమారి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎన్ పీజీ సెంటర్‌కు దరఖాస్తుల ఆహ్వానం

> ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రశాంతిశ్రీ



కాకినాడ రూరల్: తిమ్మాపురం గ్రామంలోని అచ్చంపేట జంక్షన్ వద్ద ఉన్న నన్నయ యూనివర్సిటీ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్‌లో 2025 సంవత్సరానికి ఉన్నత చదువులు అభ్యసించేందుకు కౌన్సెలింగ్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.ప్రశాంతి శ్రీ తెలియజేశారు. ఈ మేరకు మంగళవారం పీజీ సెంటరులో పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యలో ప్రవేశానికి అందుబాటులో ఉన్న ఆకర్షణీయమైన కోర్సుల వివరాలు వెల్లడించారు. ఎంఏ ఇంగ్లిషు, ఎంఏ పొలిటికల్ సైన్స్, ఎంఏ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎంఏ ఎకనామిక్స్, ఎంకామ్, ఎంఎస్సీ మాథమాటిక్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని వీటిలో చేరేందుకు ఏపీ పీజీ సెట్ కోడ్‌గా కౌన్సెలింగ్ కోడ్ ఏకేఎన్‌కే ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకు ఏపీ ఐసెట్ కౌన్సెలింగ్ కోడ్‌గా ఏకేఎన్‌కే ద్వారా అర్హత సాధించిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఎంఎస్ఎన్ పీజీ సెంటర్ క్యాంపస్‌లో విద్యార్థులకు అన్ని సదుపాయాలు ఉన్నాయన్నారు. వివరాల కోసం అడ్మిషన్స్ ఇన్‌చార్జి అబ్దుల్ కరీంను సెల్ నంబరు 97018 27564లో సంప్రదించాలన్నారు.

పరివాహన్.. ఇంకా పరేషానే!

- అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం
- యాప్ విడుదలై ఆరేళ్లయినా ప్రైవేటు వ్యక్తుల ప్రాబల్యమే
- మీసేవా కేంద్రాలకు పరుగెడుతున్న నిరక్షరాస్యులైన వాహనదారులు



బాలాజీచెరువు: పట్టభద్రులైన వారు సైతం తమ వాహన పత్రాల కోసం ఎదురుచూడక తప్పడం లేదు. వాహనదారులకు నూతన యాప్‌పై అవగాహన కల్పించడంలో రవాణాశాఖ నిర్లక్ష్యం వహిస్తున్నట్లు కనిపిస్తోంది. కాగిత రహిత సేవలకు ప్రాధాన్యం ఇస్తూ కేంద్ర ప్రభుత్వం రవాణాశాఖకు సంబంధించిన వ్యవహారాలన్నీ పరివాహన యాప్‌లోకి తెచ్చింది. అయినప్పటికీ వాహన పత్రాల కోసం ప్రైవేట్ వ్యక్తులు నిర్వహించే కేంద్రాల వద్దకు పరుగులు పెట్టాల్సి వస్తోంది. అలాగే కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన పరివాహన వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చింది. తనిఖీల సమయంలో పోలీసులకు పత్రాలు చూపించాల్సి రావడంతో ఉచితంగా ఇవ్వాల్సిన పత్రాలు డబ్బులు పెట్టి తీసుకోవలసి రావడం గమనార్హం. కాగిత రహిత పాలన లక్ష్యంగా 2019లో కేంద్ర రవాణాశాఖ ఈ యాప్‌ను, వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ వెబ్‌సైట్‌లో రవాణాశాఖకు సంబంధించిన డ్రైవింగ్ లైసెన్స్, లెర్నింగ్, రిజిస్ట్రేషన్, వంటి 16 రకాల సేవలు ఉంటాయి. వాహనదారుడు రవాణాశాఖకు చెందిన రుసుము ఇందులో చెల్లించాలి. ఆ తర్వాత అభ్యర్థి దరఖాస్తు వాహన యాప్ నుంచి ప్రింట్ తీసుకుని కార్యాలయాలనికి వెళ్లాల్సి వస్తుంది. రవాణా కార్యాలయంలో పత్రాలు చూపించిన తరువాత పరిశీలనకు ఫోన్ నంబర్‌కు వచ్చే ఓటీపీ ద్వారా అధికారులు ధ్రువీకరణ తదుపరి పత్రాలు ఇస్తారు. వాహన లైసెన్స్‌ల నుంచి రిజిస్ట్రేషన్ పత్రాలకు చెల్లించే వాటిలో పత్రాల రుసుము కూడ వాహనదారుడు చెల్లిస్తారు కాబట్టి రవాణాశాఖ ఉచితంగా పత్రాలు ప్రింట్ చేసి ఇవ్వాలి. కాగితాలు లేని కారణంగా రవాణాశాఖాధికారులు మళ్లీ మీ సేవా కేంద్రాలకు పంపుతున్నారు.

వాహనదారుల నుంచి వసూలు..

రవాణాశాఖలో లెర్నింగ్, డ్రైవింగ్ లైసెన్స్ పాసైన తరువాత ఫోన్‌కు మేసేజ్ రావడంతో మీ సేవా కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. ఉచితంగా ఇవ్వాల్సిన నిర్వాహకులు దాదాపు రూ.20 నుంచి రూ.50 వరకూ వసూలు చేస్తున్నారు. అదే కార్డు రూపంలో ప్రింట్ కావాలంటే రూ.100 నుంచి రూ.150 వరకూ చెల్లించాల్సి వస్తోంది.

అధిక భాగం నిర్లక్షరాస్యులే..

టూ వీలర్, ఫోర్ వీలర్ ధ్రువపత్రాల కోసం వచ్చే వాహనదారుల నుంచి ఏ విధమైన ఇబ్బందీ లేదు. కానీ ఆటో, హెవీ వాహన డ్రైవింగ్‌కు వచ్చేవారిలో అధిక భాగం నిరక్షరాస్యులే ఉంటారు. వీరందరూ మీసేవా కేంద్రాలకు పరుగులు పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది.

అవగాహన కల్పిస్తున్నాం..



పరివాహన్ యాప్‌ద్వారా నేరుగా సేవలు ఇంటివద్ద నుంచే చేసుకునే వెసులుబాటు ఉంది. ముఖ్యంగా డ్రైవింగ్ చేసేవాళ్లు చాలామంది నిరక్షరాస్యులు ఉండటం వల్ల వారికి అవగాహన కలగడం లేదు. గతంతో పోల్చుకుంటే ఇప్పుడు అవగాహన వచ్చింది. కార్యాలయానికి వచ్చేవారి సంఖ్య బాగా తగ్గింది. సేవలన్నీ ఆన్‌లైన్‌లో నిర్ణీత సమయానికి పూర్తి చేస్తున్నాం.

– కె.శ్రీధర్, డీటీసీ, కాకినాడ

రోటరీ గవర్నర్‌గా కల్యాణ్‌చక్రవర్తి



రోటరీక్లబ్ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి

బోట్‌క్లబ్: రోటరీ గవర్నర్‌గా డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి మంగళవారం రాత్రి స్థానిక సూర్యకళామందిరంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిస్వార్థంగా సేవ చేయాలన్నదే రోటరీ లక్ష్యమన్నారు. అందుకు అనుగుణంగా ఈ ఏడాది కాలంలోనే అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పాఠశాల స్థాయిలో విద్యార్థులకు సీపీఆర్ శిక్షణ ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. దీనికి డాక్టర్ చక్రధర్ సహకారం తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా రోటరీ సభ్యులకు సీపీఆర్ విధానంపై అవగాహన కల్పించారు. అనంతరం రోటరీ సభ్యులు రక్తదానం చేశారు. రోటరీ సభ్యులు రామకృష్ణ, ఎం.వెంకటేశ్వరరావు, కృష్ణా జిల్లా నుంచి శ్రీకాకుళం వరకూ ఉన్న 18 రెవెన్యూ జిల్లాల నుంచి రోటరీ క్లబ్ సభ్యులు ఈ ప్రమాణస్వీకారంలో పాల్గొన్నారు.